AKSHARA TODAY

అక్షరటుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

7-10-2026 (Wednesday) MAIN EDITION

పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ నగర కమిషనర్ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనాపరమైన మార్పులలో భాగంగా 16 మంది ఇన్‌స్పెక్టర్లను ట్రాన్స్‌ఫర్ చేశారు. నగరం అంతటా పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, శాంతిభద్రతల నిర్వహణను మెరుగుపరచడమే లక్ష్యంగా బదిలీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రాహుల్, ప్రియాంకలపై ఎఫ్ఐఆర్



అక్షరటుడే, ఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కాంగ్రెస్ శ్రేణులకు పెద్ద షాక్‌గా మారింది. ఈ ఆందోళన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు కీలక నేతలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనుమతి లేకుండా ఆకాశవాణి కార్యాలయం ప్రాంగణంలోకి బలవంతంగా ప్రవేశించారనే ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది.

ప్రీమియం ఫోన్ లాంచ్ చేసిన వీవో



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీ అయిన వీవో మరో ప్రీమియం మోడల్‌ను భారత మార్కెట్‌లో పరిచయం చేసింది. 7200 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం గల ఈ ఫోన్‌లో స్నాప్ డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్ అమర్చారు. ఇది ఆండ్రాయిడ్ 17 ఆపరేటింగ్ సిస్టం ఆధారంగా పనిచేస్తుంది. అక్టోబర్ 13న సేల్ ప్రారంభం కానుంది.

కరెంట్ డిమాండ్ పెరిగింది : భట్టి విక్రమార్క



అక్షరటుడే, హైదరాబాద్ : ఎల్నినో వల్ల కరెంట్ డిమాండ్ పెరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అయినా ఎలాంటి ఇబ్బంది కట్స్ లేకుండా సప్లై చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్బందుల్లో కూడా జాగ్రత్తగా సిబ్బంది కరెంట్ అందిస్తున్నారని, వారిని అభినందించాల్సింది పోయి కొందరు విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో టెన్నిస్ క్రీడాకారుల మృతి



అక్షరటుడే, యూపీ : ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లక్నో నుంచి డియోరియాకు వెళ్తున్న ఎర్టిగా కారు, ట్రక్కును ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు డీఏలు మంజూరు



అక్షరటుడే, హైదరాబాద్ : ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేస్తూ బుధవారం జీవో విడుదల చేసింది. రాష్ట్రంలో 6 డీఏలు పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో రెండు డీఏలు ఇచ్చేందుకు ఇటీవల ప్రభుత్వం అంగీకరించింది. ఇందులో భాగంగా తాజాగా ఆ రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేస్తూ ఆదేశాలు చేసింది. జనవరి 2024 నుంచి డీఏను 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచింది. అలాగే జూలై 2024 నుంచి డీఏను 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రెండు డీఏల బకాయిలను విడతలవారీగా ప్రభుత్వం చెల్లించనుంది.

తగ్గిన ఎయిర్‌పోర్ట్ బస్సు టికెట్ ధరలు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికి నడిచే 'పుష్పక్' ఏసీ బస్సుల ఛార్జీలను 40 శాతం వరకు తగ్గిస్తున్నట్లు ఆర్టీసీ తెలిపింది. జేబీఎస్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు గతంలో రూ.350 టికెట్ ఉండగా.. తాజాగా దానిని రూ.200కు తగ్గించారు. మియాపూర్ నుంచి విమానాశ్రయం వరకు రూ.350 టికెట్ ఉండగా రూ.200కు తగ్గించారు. గచ్చిబౌలి నుంచి టికెట్ ధర రూ.300 నుంచి రూ.150కి, లింగంపల్లి-ఎయిర్‌పోర్టు టికెట్ రూ.300 నుంచి రూ.200కు తగ్గిస్తున్నట్లు ఆర్టీసీ తెలిపింది. కొండాపూర్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు రూ.300 నుంచి రూ.200కు తగ్గించారు.



ఆర్బీఐ వడ్డీ మోత

- సామాన్యులకు ఆర్బీఐ షాక్
- ఇచ్చింది. వడ్డీ రేట్లను
- పెంచుతూ నిర్ణయం
- తీసుకుంది. రెపో రేటును
- 25 బేసిస్ పాయింట్ల మేర
- పెంచుతున్నట్లు ఆర్బీఐ
- గవర్నర్ సంజయ్ మల్హోత్రా
- ప్రకటించారు. దీంతో రెపో
- రేటు 5.50శాతానికి
- చేరింది. ఫలితంగా లోన్లు
- తీసుకున్న వారిపై వడ్డీ
- భారం పెరగనుంది. ప్రతి
- నెలా కట్టే ఈఎంఐలు
- మరింత పెరగనున్నాయి.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్

■ రెపో రేటు పెంచిన రిజర్వ్ బ్యాంక్ ■ పెరగనున్న ఈఎంఐల భారం

ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశం అక్టోబర్ 5న ప్రారంభమైంది. మూడు రోజులపాటు సమావేశాలు జరిగాయి. మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురు సభ్యులలో 42 సభ్యులు రెపో రేటును పెంచడానికి ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ప్రకటించారు. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడానికి మానిటరీ పాలసీ కమిటీ ఆమోదం తెలిపిందని గవర్నర్ పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, చమురు ధరల పెరుగుదల, రూపాయి బలహీనపడుతున్న నేపథ్యంలో ఆర్బీఐ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రెపోరేటును పెంచింది.

2023 తర్వాత తొలిసారి

రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.5 శాతానికి చేర్చింది. ఫిబ్రవరి 2023 తర్వాత రెపో రేటును పెంచడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఆర్బీఐ చివరి సారిగా 2023 ఫిబ్రవరిలో వడ్డీ రేట్లను పెంచింది. అప్పట్లో 25 బేసిస్ పాయింట్లు పెంచడంతో రెపో రేటు 6.5 శాతానికి చేరింది. 2025లో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రక్రియను ప్రారంభమైంది. గతేడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లలో వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర, జూన్‌లో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించారు. అనంతరం డిసెంబరులో మరో 25 బేసిస్ పాయింట్లు కోత విధించారు. దీంతో రెపో రేటు 5.25 శాతానికి తగ్గింది. అప్పటినుంచి అదే రేటు కొనసాగుతోంది. అయితే జియో పొలిటికల్ టెన్షన్స్‌తో ముడి చమురు ధరలకు రెక్కలు రావడంతో ఇన్ఫ్లేషన్ భయాలు వెన్నాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచాలని నిర్ణయం తీసుకుంది.

సామాన్యులపై భారం

రెపో రేటు పెరగడంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందిన వారిపై అదనపు భారం పడనుంది. బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచుతాయి. కొత్తగా రుణాలు తీసుకునే వారితో పాటు ఇప్పటికే ఈఎంఐలు కడుతున్న వారు సైతం ఈ భారాన్ని భరించాల్సి ఉంటుంది. ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేట్ సెలెక్ట్ చేసుకున్న వారిపై వడ్డీ భారం పడుతుంది. ఫిక్స్‌డ్ వడ్డీ రేట్లతో రుణం పొందిన వారిపై ఎలాంటి భారం ఉండదు. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సైతం వడ్డీని బ్యాంకులు పెంచే అవకాశం ఉంది.

వికసిత్ భారత్‌ను సాధిస్తాం : ప్రధాని మోదీ




అక్షరటుడే, ఢిల్లీ : భారత దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తామని ప్రధాని మోదీ అన్నారు. సీఎం, పీఎంగా ఆయన 25 ఏళ్లు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మేము దీన్ని సాధిస్తాం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. 140 కోట్ల మంది పౌరులు కలిసి 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మిస్తారన్నారు. 2047 నాటికి అగ్రశ్రేణి 3 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలవడం, స్వయం సమృద్ధి, ప్రపంచ తయారీ కేంద్రం, ఒలింపిక్స్ నిర్వహణ, అంతరిక్షంలోకి అడుగుపెట్టడం వంటి లక్ష్యాలను సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్, ప్రియాంకల అరెస్టు అప్రజాస్వామికం: మంత్రి పొన్నం



అక్షరటుడే, హైదరాబాద్ : దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.
దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో ఓట్ల తొలగింపు , ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో “ఓటు బచావో దేశ్ బచావో” నినాదంతో ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న తప్పులను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ తదితర జాతీయ నాయకులను అదుపులోకి తీసుకోవడం పూర్తిగా అప్రజాస్వామికమని, నియంతృత్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.

25 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీ



అక్షరటుడే, ఢిల్లీ : భారత రాజకీయ చరిత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త మైలురాయిని అధిగమించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత దేశ ప్రధానమంత్రిగా ఆయన నిరంతరాయంగా 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని అక్టోబర్ 7 నాటికి విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ప్రజాప్రభుత్వ అధినేతగా ఏకతాటిపై పాతికేళ్ల పాటు సేవలు అందించిన ఏకైక నేతగా ఆయన ఈ చారిత్రాత్మక రికార్డును సృష్టించారు. ఈ విశేష సందర్భాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ప్రసిద్ధ శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించిన ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తేలిన సంగమేశ్వర ఆలయం



అక్షరటుడే, మహబూబ్‌నగర్ : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న చారిత్రక సంగమేశ్వరాలయం కృష్ణా నదిలో నీటి మట్టం తగ్గడంతో బయటపడింది. ప్రతి ఏటా వేసవిలో మాత్రమే ఈ ఆలయం బయట పడుతుంది. కానీ ఈ సారి ముందుగానే తేలడం గమనార్హం. సాధారణంగా వేసవి కాలంలో మాత్రమే కనిపించే ఈ ఆలయం, ఈ ఏడాది ముందుగానే నీటి పైకి తేలింది. దాదాపు 25 ఏళ్ల తర్వాత ఇలా జరగడం విశేషమని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆలయం ప్రతి ఏటా ఏడాదిలో సుమారు 8 నెలల పాటు కృష్ణా నది నీటిలో మునిగి ఉండి, దాదాపు 4 నెలల పాటు నీటి మట్టానికి పైన ఉంటుంది. ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

జనసేనలోకి వైఎస్ఆర్‌సీపీ, సీపీఎం కీలక నేతలు

అక్షరటుడే, ఏపీ: విజయవాడలో జనసేన పార్టీ బలోపేతమవుతోంది. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్ఆర్‌సీపీ, సీపీఎం నాయకులతో పాటు విద్యాసంస్థల నిర్వాహకులు, వ్యాపారవేత్తలు జనసేన పార్టీలో చేరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగబాబు మాట్లాడుతూ.. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యకర్తలందరినీ సొంత కుటుంబ సభ్యులతో సమానంగా చూసుకుంటారని తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం : బండి సంజయ్



అక్షరటుడే, కరీంనగర్: కేసీఆర్ భూ వివాదాలపై చర్యలు తీసుకోవడం కేవలం కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న ఒక డ్రామా మాత్రమేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము, సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, అలాగే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై పోరాడే సామర్థ్యం బీఆర్ఎస్ పార్టీకి కూడా లేదని ఆయన దుయ్యబట్టారు. ఈ రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.